నేటి నుంచి 108 సేవల నిలిపివేత

పావగడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 108 అంబులెన్స్ సేవలు ఆగిపోనున్నాయి. మూడు నెలల నుంచి సిబ్బందికి జీతాలు రాకపోవడంతో శనివారం రాత్రి నుంచి విధులను నిలిపివేసి నిరసన చేపడుతున్నట్లు కర్ణాటక రాష్ట్ర ఆరోగ్య కవచ ఉపాధ్యక్షుడు పరశురాం శుక్రవారం ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా 715 అంబులెన్స్‌లకు గాను 3500 మంది సిబ్బంది పనిచేస్తున్నారని, రాత్రింబవళ్లు నిద్రాహారం లేకుండా ఉచిత సేవలు అందిస్తున్నప్పటికీ తమకు జీతాలు అందించకపోవడం దారుణం అని వాపోయారు.

న్యూస్‌బాక్స్

ఏడుగురు ఐపీఎస్‌ల బదిలీ



బెంగళూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఏడుగురు ఐపీఎస్‌లను బదిలీ చేశారు. పోస్టింగ్ కోసం వేచియున్న శాంతను సిన్హాను సీఐడీ డీఐజీగా బదిలీ చేశారు. ఏడుగురు ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సంగీతాను సీఐడీ ఎస్పీగాను, అబ్దుల్ అహద్‌ను బీఎంటీసీ సెక్యూరిటీ డైరెక్టర్‌గాను, లక్ష్మణ నింబరగిని విజయపుర ఎస్పీగాను, చన్నబసవణ్ణ లంగోటిని పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గాను, పృథ్విక్‌శంకర్‌ను యాదగిరి ఎస్పీగాను, శివాంషు రాజ్‌పుత్‌ను స్టేట్ క్రైం విభాగం ఎస్పీగాను బదిలీ చేశారు. కాగా ఐఏఎస్ అధికారి చంద్రశేఖర్ నాయక్‌ను కమర్షియల్ ట్యాక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి బదిలీ చేశారు. ఇదే హోదాలో ఉన్న శిఖా ఢిల్లీ సర్వీసులకు వెళ్లిన తరుణంలో చంద్రశేఖర్ నాయక్‌ను బదిలీ చేశారు. సదాశివ ప్రభును మధ్యాహ్నభోజనం పథకం డైరెక్టర్‌గా నియమించారు.

దర్శన్‌కు మధ్యంతర బెయిల్‌పై సుప్రీంలో పిటిషన్‌కు సర్కారు ఓకే



బెంగళూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ రేణుకాస్వామి హత్యకేసులో ఏ2గా ఉన్న నటుడు దర్శన్ బెయిల్ ఆదేశాలను రద్దు చేయాలని సుప్రీంకోర్టులో పిటిషన్ వేసేందుకు ప్రభుత్వం సమ్మతించింది. హత్యకేసులో రిమాండు ఖైదీగా బళ్లారి జైలులో ఉంటూ దర్శన్ వెన్నునొప్పి చికిత్స కోసం మధ్యంతర బెయిల్ పొందారు. హైకోర్టు ఆరు వారాల పాటు బెయిల్ మంజూరు చేసింది. ఈలోగా విచారణ అధికారులు బెయిల్ రద్దు కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలుపై హోంశాఖకు విన్నవించారు. అందుకు అనుగుణంగానే హోంశాఖ సమ్మతి తెలిపింది. ఈమేరకు శుక్రవారం నగర పోలీస్ కమిషనర్ దయానంద్ మీడియాతో మాట్లాడుతూ హోంశాఖ అనుమతులు ఇచ్చిన మేరకు త్వరలోనే సుప్రీంకోర్టులో బెయిల్ పిటిషన్ రద్దు కోరుతూ దాఖలు చేస్తామన్నారు.

నమ్మలేం..!



- నమ్మ క్లినిక్‌లపై ఆసక్తి చూపని రోగులు
- అరకొర సిబ్బంది కారణంగా అందని వైద్యసేవలు
- జనరల్ ఆసుపత్రుల వైపే ప్రజల మొగ్గు
- సౌకర్యాలు పెంచుతామంటున్న అధికారులు

బెంగళూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీ లో పేదలకు వైద్యం అందుబాటులోకి తీసుకురావాలని, తద్వారా వారు సంపాదించిన సొమ్ములో ఆరోగ్యానికి చేసే ఖర్చులను తగ్గించాలని భావించిన ఆప్ ప్రభుత్వం 'మొహల్లా క్లినిక్'లను ప్రారంభించింది. అదే తరహాలోనే బెంగళూరు ప్రజలకు గుణాత్మకమైన ఆరోగ్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రారంభమైన 'నమ్మ క్లినిక్'లకు రోగుల కొరత వెంటాడుతోంది. నగర వ్యాప్తంగా దాదాపు వార్డుకొకటి చొప్పున 222 క్లినిక్‌లు పనిచేస్తుండగా పది ఆసుపత్రుల్లో రోజుకు ఒకరిద్దరికి మించి రోగులు రాకపోవడం సర్వత్రా చర్చనీయాంశం అవుతోంది. బెంగళూరు పరిధిలోని 27 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో క్లినిక్ ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించింది. వీటితోపాటు విధానసౌధ, ఆరోగ్యసౌధ, హైకోర్టు, సిటీ సివిల్ కోర్టు, ఎంఎస్ బిల్డింగ్‌తో పాటు నగరంలోని ఏడు ప్రాంతాల్లో నమ్మక్లినిక్‌లను ఏర్పాటు చేశారు. ప్రారంభంలో ఆశాజనకంగా రోగులు వచ్చేవారు. అందుకు అనుగుణంగానే సేవలు అందుతుండేవి. వైద్యులు, నర్సులు అందుబాటులో ఉండేవారు. ఇటీవలికాలంలో నమ్మ క్లినిక్‌లకు వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. సమగ్రమైన వైద్యసేవలు అందవని, ఉన్న మాత్రలతోనే డాక్టర్లు సరిపెడతారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో నగర పరిధిలోనే ఉండే విక్టోరియా, బౌరింగ్, కేసీ జనరల్, జయనగర్ జనరల్, యలహంక ఆసుపత్రులవైపు వెళ్లేందుకు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. పైగా ఏ ప్రాంతంనుంచైనా విక్టోరియా ఆసుపత్రికి చేరుకునేందుకు బస్సు సర్వీసులు అందుబాటులో ఉండడంతో నమ్మ క్లినిక్‌లకు వెళ్లి సమగ్రత లేని వైద్యానికి ఆసక్తి చూపడం లేదు.



రూపేన అగ్రహారలోని నమ్మ క్లినిక్

రోజుకొకరు మాత్రమే..

రాజరాజేశ్వరినగర్‌లోని తళఘట్టపుర నమ్మ క్లినిక్‌కు గడిచిన ఏడు నెలల్లో సరాసరిని పరిశీలిస్తే రోజుకు ఒకరోగి మాత్రమే చికిత్స పొందారు. ఏడు నెలలకు 203మంది నమ్మ క్లినిక్‌ను సందర్శించారు. దీంతో సరాసరి నెలకు 29మంది వచ్చినట్లయ్యింది. బొమ్మనహళ్ళిలోని ఆర్‌బీఐ లే అవుట్‌లో రోజుకు సరాసరిన 9మంది, వినాయకనగర్ లే అవుట్‌లో ఆరుగురు, తూర్పు విభాగం కోనేన అగ్రహారలో క్లినిక్‌లో నలుగురు, పులకేశినగర్ క్లినిక్‌లో 9మంది, మహదేవపుర దొడ్డనెక్కుంది క్లినిక్‌లో ఆరుగురు, మున్నేకొల్లాల క్లినిక్‌లో ఏడుగురు, చిక్కపేట క్లినిక్‌లో ఐదుగురు, లక్కసంద్ర, యలహంక అమృతహళ్ళి క్లినిక్‌లలో తలా 9మంది చొప్పున చికిత్సలు పొందారు. డాక్టర్లు, సిబ్బంది, ఫార్మసిస్టుల సంఖ్యకంటే రోజువారి చికిత్స పొందేవారు తక్కువగా ఉండడం సర్వత్రా విమర్శలకు కారణమవుతోంది.

వెంటాడుతున్న వైద్యుల కొరత

కొన్ని చోట్ల వైద్యుల కొరత వెంటాడుతోంది. మరికొన్ని చోట్ల వైద్యులున్నా రోగులు రాకపోవడంతో వృథాగా కూర్చోవాలని విసుగు చెంది వైద్యులు వెళ్లిపోతున్నారు. మరోవైపు సిబ్బంది పూర్తిస్థాయిలో లేకపోవడం, ఉన్నవారికి పనిలేకపోవడం కూడా సమస్యగా మారుతోంది. నమ్మక్లినిక్ డాక్టర్లకు నెలకు రూ.60వేలు వేతనం చెల్లించేలా ఆదేశించారు. సిబ్బంది, ఫార్మా విభాగం, ఇంజెక్షన్‌లు నిర్వహించేందుకు రిఫ్రిజిరేటర్ లేకపోవడం కూడా రోగుల విమర్శలకు కారణమవుతోంది. క్లినిక్ అంటే డాక్టర్లు సిబ్బందితో పాటు సాధారణ పరీక్షలు జరిపేందుకు ల్యాబ్, ఫార్మా విభాగం ఉండాల్సి ఉంది. పేరుకు మాత్రమే నమ్మ క్లినిక్‌లు ఆరంభించినా, సౌలభ్యాలు లేకపోవడమే రోగులు రాకపోవడానికి కారణంగా తెలుస్తోంది.

బొమ్మనహళ్ళికి 50మంది

222 క్లినిక్‌ల్లో సరాసరిన రోజుకు 50మంది రోగులు సందర్శించే ఏకైక నమ్మ క్లినిక్‌గా బొమ్మనహళ్ళి పేరొందింది. బొమ్మనహళ్ళిలోని రూపేన అగ్రహారలోని క్లినిక్‌కు సరాసరిన 53మంది సందర్శిస్తున్నారు. మిగిలిన క్లినిక్‌లను పరిశీలిస్తే 10-19మంది రోగులు, 63 క్లినిక్‌లకు 20-29మంది, 106 క్లినిక్‌లలో 50మందికిపైగా సందర్శించే ఆసుపత్రులు రూపేన అగ్రహార మాత్రమే ఉంది. రోగులు నమ్మ క్లినిక్‌లకు రాకపోవడానికి పలు సమస్యలు ఉన్నాయి.

సౌకర్యాలు కల్పిస్తాం : కమిషనర్

నమ్మ క్లినిక్‌లలో సౌలభ్యాలు పెంచేందుకు చర్యలు చేపడతామని బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ వెల్లడించారు. బాధితులకు సత్వర సేవలందించేందుకు సిబ్బందిని నియమిస్తామన్నారు. బాధితులు వైద్య సేవలు ఉపయోగించుకోవాలన్నారు.



మాతబడ్డ ఆరోగ్య కేంద్రం

ఉద్యోగి ఆత్మహత్య కేసులో మంత్రి పీఏ సహా ముగ్గురికి బెయిల్

బెంగళూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బెళగావి తహసీల్దారు కార్యాలయంలో ఉద్యోగి రుద్రణ్ణ యాదణ్ణవర్ (35) ఆత్మహత్య కేసులో మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ పీఏ సోము సహా ముగ్గురికి బెయిల్ మంజూరయ్యింది 9రోజుల క్రితం తహసీల్దారు కార్యాలయంలో రుద్రణ్ణ ఆత్మహత్య చేసుకోగా తహసీల్దారు, మరో ఉద్యోగితోపాటు మంత్రి పీఏపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తహసీల్దారు కార్యాలయ అధికారిక వాట్సప్ గ్రూప్‌లో ముగ్గురు వేధిస్తున్నారని, వారి పేర్లు నమోదు చేసి రుద్రణ్ణ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వాట్సప్ సమాచారం ఆధారంగా ముగ్గురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వారిని అరెస్టు చేసేందుకు ప్రత్యేక పోలీసుల బృందాలను ఏర్పాటు చేశారు. వారి ఆచూకీని గుర్తించలేకపోయారు. వారి తరఫున దాఖలైన బెయిల్ పిటిషన్‌ను శుక్రవారం విచారణ జరిపిన బెళగావి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. కాగా బెళగావి ఎంపీ జగదీశ్‌శెట్టర్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ రాజకీయ ప్రముఖుల ఒత్తిడితోనే పోలీసులు దర్యాప్తు సజావుగా చేయడం లేదన్నారు. పరోక్షంగా లక్ష్మీహెబ్బాళ్కర్ ఒత్తిడి కారణమని తేల్చి చెప్పారు.

రైతులను ఆదుకోండి



గెణకల్ వద్ద నేలకొరిగిన వరిని చూపుతున్న రైతు

కంప్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): చేతి కొచ్చిన వరి పంటలు వర్షం కారణంగా నేలకొరిగా నష్టపోయామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో బళ్లారి జిల్లాలోని కురుగోడు, కంప్లి, గెణికల్ వద్ద వరి పంట నేలరాలింది. చేతికొచ్చిన పంట నీటి పాలయ్యిందని రైతు మంజు ఆవేదన వ్యక్తం చేశాడు. తన ఐదు ఎకరాల వరి పంట నేలపాలయ్యిందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టామని, పంట కోసే సమయంలో ఇలా తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.



అగ్రికల్చర్ విద్యార్థులు ఉద్యోగులు కారాదు

- ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి: మంత్రి మునియప్ప
- కృషిమేళాలో రెండోరోజూ అదే సందడి

మేళాలో ఆకట్టుకుంటున్న పొద్దుతిరుగుడు తోట

7

మహారాష్ట్రలో సీఎం ప్రచారం

- అహ్మదాబాద్ జిల్లాలో పర్యటించిన సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్

ఎన్నికల ప్రచార సభలో సీఎం సిద్దరామయ్య



వక్ఫ్ నోటీసులపై బీజేపీ పోరాటం

- మూడు బృందాలుగా జిల్లాల్లో పర్యటనలు
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర



బెంగళూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు నుంచి రైతుల భూములకు నోటీసులు జారీ చేస్తున్న తరుణంలో వారికి మద్దతుగా బీజేపీ పోరాటానికి సిద్ధమైంది. ఓవైపు రెబెల్ బృందం పాదయాత్రను ప్రకటించగా పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర మూడు బృందాలను వెల్లడించారు. 'నమ్మ భూమి - నమ్మ హక్కు' పేరిట జిల్లాల్లో యాత్రలు చేస్తామని శుక్రవారం ప్రకటించారు. బీదర్, కలబురగి, యాదగిరి, రాయచూరు, కొప్పళ, గదగ్, విజయపుర, బాగల్కోటె జిల్లాల్లో పర్యటించే బృందంలో పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర, కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి, ఎంపీ జగదీశ్‌శెట్టర్, మాజీ మంత్రులు భగవంత్‌ఖూబా, అశ్వత్థనారాయణ, మురుగేశ్ నిరాణి, రమేశ్‌జార్కిహొళి, ఈరణ్ణకడాడితోపాటు పలువురు ఉన్నారు. రెండో బృందం చామరాజనగర, మైసూరు, మండ్య, హాసన్, కొడగు, దక్షిణకన్నడ, ఉడుపి, చిక్కమగళూరు, శివమొగ్గ, ఉత్తరకన్నడ జిల్లాల్లో పర్యటించే బృందంలో ప్రతిపక్షనేత అశోక్, బసవరాజ్ బొమ్మై, బసవనగౌడపాటిల్ యత్నాళ్, రాజుగౌడ, రేణుకాచార్య తదితరులు ఉన్నారు. మూడోబృందం రామనగర, బెంగళూరు గ్రామీణ, కోలారు, చిక్కబళ్ళాపుర, తుమకూరు, దావణగెరె, చిత్రదుర్గ, హావేరి, హుబ్బళ్ళిలో పర్యటించే బృందంలో పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణ స్వామి, సదానందగౌడ, కేంద్ర మంత్రి సోమణ్ణ, నళిన్‌కుమార్ కటీల్, అరవింద లింబావళి తదితరులు ఉన్నారు. ఇందులో రెబెల్ కూటమిలోని కీలక నేతల పేర్లను నమోదు చేయడం విశేషం.

చిన్నారులను కబళిస్తున్న కేన్సర్

- ఏటా 900 మందికి..
- రాష్ట్రంలో పెరుగుతున్న బాధితులు
- బెంగళూరులో అత్యధికం



కిద్వాయ్ మెమోరియల్ ఆసుపత్రి

బెంగళూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏటా కేన్సర్ బాధితుల సంఖ్య గణనీయంగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. వైద్య ఆరోగ్యశాఖ పలు విధాల ఆహార పదార్థాలను పూర్తిగా నిషేధించింది. అయినా కేన్సర్ మహమ్మారి విస్తరిస్తూనే ఉంది. రాష్ట్రంలో ఏటా 900మంది చిన్నారులకు కేన్సర్ సోకుతున్నట్లు కిద్వాయ్ స్మారక కేన్సర్ ఆసుపత్రి అంచనా వేసింది. వీరిలో బెంగళూరులోనే సరాసరి 280-300మంది చిన్నారులు ఉన్నట్లు తేలడం ఆందోళన కలిగించే విషయం. అన్ని వయస్సుల పరిశీలిస్తే 2.7మంది శాతంమంది బాలురు కాగా, 1.3శాతం మంది బాలురు ఉన్నారు. బాలురులో లింఫాయిడ్ లుకేమియా (20.6శాతం), మైలోయిడ్ లుకేమియా (14.4శాతం), మెదడు, నరాలకు సంబంధించి 13.8శాతం, ఎన్‌హెచ్ఎల్ 7.5శాతం, హాడిల్గన్స్ 6.9శాతంగా ఉంది. ఇక మహిళల్లో లింఫాయిడ్ లుకేమియా 25.5శాతం, మెదడు, నరాలకు సంబంధించి 12.8శాతం, మైలోయిడ్ లుకేమియా 12.8 శాతం, ఎముకల కేన్సర్ 11.7శాతం, అండాశయ కేన్సర్ 5.3శాతం, హాడిల్గన్స్ 4.3శాతం ప్రబలుతున్నట్లు నివేదికలో ప్రస్తావించారు.

గత ఏడాది 86వేల మందికి

గత ఏడాది 86,563మంది ఆసుపత్రిలో చేరారు. 2.3లక్షల మంది కేన్సర్ బాధితులకు చికిత్స అందిస్తున్నారు. బెంగళూరు నగర పరిధిలో ఏడాదికి 14,630 కేసులు నమోదవుతుండగా వీటిలో 6,650 మంది పురుషులు, 7,980మంది మహిళలు ఉన్నారు. పురుషులలో శ్వాసకోశ కేన్సర్ 9.7శాతం ఉండగా ప్రొస్టేట్ 6.9 శాతం, కడుపు కేన్సర్ 6.5శాతం, నోటి కేన్సర్ 6.4శాతంగా ఉంది. మహిళల్లో తీవ్రంగా పీడిస్తున్నది బ్రెస్ట్ కేన్సర్‌గా ఉంది. ఏకంగా 31.5 శాతం నమోదవుతోంది. గర్భకోశ కేన్సర్ 9.1శాతం, అండాశయ కేన్సర్ 6.4శాతం, నోటి కేన్సర్ 4.3శాతం, కార్పస్ యుటేరి కేన్సర్ 4.2శాతంగా ఉంది.

ముందు జాగ్రత్తలు తప్పనిసరి

కేన్సర్ అత్యంత ప్రమాదకరమైన జబ్బులలో ఒకటిగా ఉంది. రోగం వచ్చాక చికిత్స పొందడం కంటే ముందస్తు జాగ్రత్తలు పాటించడమే ఉత్తమమని వైద్యులు సూచిస్తున్నారు. అతిగా పొగాకు ఉత్పత్తుల వాడకం, మద్యపానం, ధూమపానం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. శ్వాసకోశ కేన్సర్ నోరు, గొంతు, అన్నవాహిక, కడుపు, పేగులకు కేన్సర్ ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండడం సముచితమని సూచిస్తోంది. ఇటీవలికాలంలో జంక్‌ఫుడ్‌కు చిన్నారులు ఆకర్షితులు కావడం ప్రమాదాలకు కారణమవుతోందని వైద్యనిపుణులు అభిప్రాయపడుతున్నారు. కృత్రిమమైన రంగులు వాడి రుచి, రంగు ఆకర్షణీయంగా ఉంటుందని క్యాండీలను ఇష్టపడతారు. ఇటీవల రాష్ట్రంలో కేన్సర్ నియంత్రణతోపాటు ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆహార పదార్థాల విక్రయాలపై మెరుపు దాడులు చేశారు. తొలుత క్యాండీపై నిషేధం విధించారు. ఆ తర్వాత గోబి మంచూరియాకు రంగుల వాడకాన్ని కట్టడి చేశారు. ఇటీవల కొన్నిరకాల కేక్‌లపై కృత్రిమ రంగుల వాడకాన్ని కూడా నిషేధించారు. రాష్ట్రంలో కిద్వాయ్ సంస్థ కేవలం చికిత్సలకే పరిమితం కాకుండా చైతన్యం కల్పించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది.



చండీపారాయణలో రుత్వికులు

భక్తిశ్రద్ధలతో నవచండీయాగం

బెంగళూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని యలహంక బాగలూరు క్రాస్‌లోని సీతారామ ఆలయంలో నవచండీయాగం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురు, శుక్రవారాల్లో పలు ధార్మిక కార్యక్రమాలు సాగాయి. సంహితా ట్రస్టు వ్యవస్థాపకులు వేదబ్రహ్మ కరణం హరిహర ప్రసాద శర్మ నేతృత్వంలో గోపూజ, గణపతిపూజ, స్వస్తివాచనము, నాంది, కంకణధారణ, కళశస్థాపన, చండీపారాయణ, ఏకాదశ రుద్రాభిషేకాలు, శ్రీచక్రార్చన నిర్వహించారు. భక్తమమండలి ప్రముఖులు వెంకటరాజు, మోహనరాజు, జనార్దన రాజు, నరసరాజు, వెంకటరాజు శ్రీనివాస రాజు తదితరులు పాల్గొన్నారు.



తల తడవకుండా..

నగరంలో జోరు వాన

బెంగళూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలో రెండు మూడు వారాల తర్వాత పగటిపూటే వర్షం దంచికొట్టింది. శుక్రవారం ఉదయం నుంచే తుంపరలు కొసాగగా మధ్యాహ్నం తర్వాత జోరు వాన కురిసింది. వారాంతంలో సొంతూళ్లకు వెళ్లేవారు, ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. మధ్యాహ్నం ప్రారంభమైన వాన వివిధ ప్రాంతాల్లో సాయంత్రం దాకా కురిసింది. నగర ప్రజలు ఇబ్బంది పడ్డారు.



కబ్బన్ పార్క్ మార్గంలో వర్షంలో వాహనాలు



రెయిన్‌కోట్‌తో ద్విచక్రవాహనదారుడు



దీపాలతో హారతులు..



హెచ్చెల్సీ వద్ద పూజలు..





చన్నీటి స్నానం..



గంగలో దీపాలు వదిలేస్తూ..

వెలుగెత్తిన దీపాలు

నేత్రపర్వంగా కార్తీక దీపోత్సవం

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

అనంతపురం కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి వేడుకలను జిల్లా ప్రజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే శైవాలయాలకు భక్తులు పోటెత్తారు. చిన్నారులు, మహిళలు తమ భక్తిని ప్రమిదలుగా వెలిగించి కైలాసనాథుడిని ఆరాధించారు. హర నామ స్మరణతో ఆయా ఆలయాలు ప్రతిధ్వనించాయి. జిల్లాకేంద్రంలోని హెచ్చెల్సీ కెనాల్‌లో పలువురు మాలధారులు, మహిళలు వేకువజామునే చన్నీటి స్నానాలాచరించి, కార్తీక దీపాలను వదిలారు. మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో ఉదయం నుంచి కాశీవిశ్వేశ్వరునికి పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు చేశారు. ఆలయ ఆవరణలో భక్తులు పెద్దఎత్తున దీపాలు వెలిగించారు. రాత్రికి స్వామివారికి దశహారతులు సమర్పించిన అనంతరం ఊయ్యాల సేవ నిర్వహించారు. నగరంతోపాటు జిల్లా వ్యాప్తంగా కార్తీక దీపోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు.




శివ శివా..



కార్తీక శోభ..



1వ రోడ్డు శివాలయంలో కార్తీక దీపోత్సవానికి పోటెత్తిన భక్తజనం



ఆరనీకుమా ఈ దీపం..



ఈశ్వరా.. పరమేశ్వరా..



అరవింద్‌నగర్ శివాలయంలో దీపాలు వెలిగిస్తూ..



గీతామందిర్‌లో క్షీరాభిషేకం..





శివకోటిలో శివలింగానికి హారతుల వెల్లువ.. దీపాలు వెలిగిస్తూ..

'మహాప్రస్థానం' ప్రారంభించిన ఎంపీ అంబికా



మహాప్రస్థానం వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురంటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆస్పత్రిలో మృతదేహాలను తరలించడానికి మంజూరైన మహాప్రస్థానం వాహనాన్ని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ శుక్రవారం ప్రారంభించారు. ఇక్కడ ఉన్నవాహనం పాతబడటంతో పాటు మృతదేహాలు తరలించడానికి పేదలు ఇబ్బంది పడుతుండటంతో గతంలో ఉన్న ఎంపీ తలారిరంగయ్య ఎంపీ నిధులు మంజూరు చేశారు. వాటితో కొనుగోలు చేసిన నూతన వాహనం శుక్రవారం ఆస్పత్రికి వచ్చింది. దాన్ని ఎంపీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన చికిత్స అందించాలని, ఆస్పత్రికి అవసరమైన సహకారం తాను అందిస్తానని ఆయన డాక్టర్లకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓలు డాక్టర్ పద్మజ, డాక్టర్ హేమలత, డాక్టర్ నవీన్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణితో పాటు పలువురు డాక్టర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో సీడాప్ అధికారులు, ప్రిన్సిపాల్, కంపెనీ ప్రతినిధులు

113 మందికి ఉద్యోగాలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ-వెలుగు, సీడాప్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. ఫ్యూషన్ మైక్రో ఫైనాన్స్ కంపెనీలో రిలేషన్‌షిప్ ఆఫీసర్ ఉద్యోగాలకు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 435మంది హాజరు కాగా...113మంది ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు కాలేజి ప్రిన్సిపాల్ దివాకర్ రెడ్డి, సీడాప్ జేడీఎం సూర్యనారాయణ నియామకపత్రాలు అందజేశారు. ఎంపికైన వారు అనంతపురం, రాయదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు, కదిరి, పెనుకొండ, హిందూపురం, గోరంట్లలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సీడాప్ ఏపీ చైర్మన్ దీపక్‌రెడ్డి, డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జేకేసీ ఇన్‌చార్జ్ వెంకటేష్, సీడాప్ ట్రైనర్ నారాయణస్వామి, మునీంద్ర, కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కుష్బూకొఠారీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షల ఉచిత శిక్షణకు జిల్లాలోని బీసీ,ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కుష్బూకొఠారీ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 24లోపు అనంతపురంలోని బీసీ స్టడీసర్కిల్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. బీసీలో 66 శాతం, ఎస్సీల్లో 20 శాతం, ఎస్టీల్లో 14 శాతం మందిని రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక చేస్తారన్నారు. ఎంపికైన వారికి విజయవాడ గొల్లపూడిలోని బీసీ భవన్‌లో ఉచిత శిక్షణ ఇస్తారని తెలిపారు. అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంకు పాసు బుక్కు, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో బీసీ స్టడీ సర్కిల్‌లో అందజేయాలన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. లక్షలోపు ఉండాలన్నారు. వివరాలకు ఫోన్ : 08554-275575, సెల్ : 7799043773కు సంప్రదించాలన్నారు.

టమోటా కిలో రూ.23



అనంతపురంరూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం మార్కెట్‌కు 900 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.18, కనిష్ఠ ధర రూ.13 పలికినట్లు ఆయన తెలిపారు.

మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలి

పీఆర్టీయూ నాయకులు

అనంతపురం విద్య, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని, కరువుభత్యం బకాయిలు వెంటనే విడుదల చేయాలని పీఆర్టీయూ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులు శుక్రవారం ఉపాధ్యాయభవన్‌లో సమావేశం నిర్వహించారు. సంఘం సీనియర్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, ప్రధానకార్యదర్శి తిమ్మారెడ్డి ఇతర నాయకులు మాట్లాడారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాల బకాయిలు తక్షణం చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సంపాదిత సెలవుల నగదు జమ చేయాలని, రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన సొమ్ము వారి ఖాతాల్లో పడేలా చూడాలన్నారు. నెలవారీ ప్రమోషన్లు ఇచ్చి, హైస్కూళ్లలో ఖాళీ పడిన ప్రధానోపాధ్యాయ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. జీవో117 రద్దు చేయడంతోపాటు, 3,4,5 క్లాసులను హైస్కూళ్ల నుంచి పూర్వపు ప్రైమరీ స్కూళ్లకు పంపాలన్నారు. ఎంఈఓల మాదిరిగానే..ప్రతి డివిజన్‌కు ఇద్దరు డిప్యూటీ డీఈఓలను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకుల కేశవరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, హనుమంతరెడ్డి, వేమారెడ్డి, రామ్మూర్తి, రామ్మోహన్‌రెడ్డి, ఎల్లప్ప, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

మత్తుతో జీవితాలు నాశనం

అమ్మినా, వినియోగించినా కఠిన చర్యలు

ఇప్పటికే 23మంది గుర్తింపు, 11 మందికి రిమాండ్

మత్తు నివారణ సమీక్షలో కలెక్టరు, ఎస్పీ



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టరు, ఎస్పీ

అనంతపురంటౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాల వాడకం వల్ల జీవితాలు నాశనమవుతాయని కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్, జిల్లా ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. మత్తు పదార్థాలను అమ్మినా, వినియోగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం మత్తునివారణ జిల్లా కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్థాలు విక్రయించుకుండా, వినియోగించకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలలో ఎక్కువగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కొన్ని కాలేజీలలో ప్రహరిక్లబ్‌లు ఫెయిల్ అయినట్లు ఎస్పీ చెబుతున్నారు. ఆవివరాలు ఎస్పీ నుంచి తీసుకొని ఆవిద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఇంటర్ విద్యఅధికారిని కలెక్టరు ఆదేశించారు.ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో ప్రహరిక్లబ్ నిర్వహించాలని, దీనికి డీవీఈఓ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించాలని సూచించారు. పిల్లలకు పుస్తకపఠనం, యోగా, క్రీడలు వంటి అంశాలపై ఆసక్తి పెంచేలా ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు చూడాలని ఆదేశించారు. మత్తు వల్లకలిగే నష్టాలు, వాటిని అమ్మినా, వినియోగించినా చట్టపరంగా ఎలాంటి చర్యలు ఉంటాయో పిల్లలకు అవగాహన కల్పించాలని కలెక్టరు విద్యాశాఖాధికారులను ఆదేశించారు. జిల్లాలో డ్రాపౌట్స్ వివరాలు పక్కా సమాచారంతో అందించాలని ఆదేశించారు. మత్తుకు బానిసైన వారికి వైద్యచికిత్సలు అందించడం కోసం జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్‌సెంటర్‌లో అన్ని వసతులు ఉండేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. నిధులు అవసరమైతే జనరల్‌ఫండ్స్ కింద తీసుకోవాలని సూపరింటెండెంట్‌కు కలెక్టరు సూచించారు.

● రెండు కాలేజీలు, 9మంది విద్యార్థుల గుర్తింపు: ఎస్పీ

జిల్లాలో మత్తు పదార్థాల నివారణకు గట్టి చర్యలు తీసుకుంటామని ఎస్పీ జగదీష్ వెల్లడించారు. గత నెలలో ఐదు కేసులకు సంబంధించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మరో కేసులో 20మందిని గుర్తించామని వీరిలో 11మందిని రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు. ఇందులో రెండు కాలేజ్‌లకు చెందిన 9మంది విద్యార్థులు ఉన్నారన్నారు. ఆయాకళాశాలల యాజమాన్యాలకు వారి వివరాలు తెలియజేశామన్నారు. రెండురోజుల కిందట కూడా పాతూరు వన్‌టౌన్ పరిధిలో రెండు చిన్నప్యాకెట్లును గుర్తించినట్లు తెలిపారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు అమ్మినా, వినియోగించినా, రవాణా చేసినా ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. సమీక్షలో ఆర్డీఓ వసంతబాబు, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీదేవి, డీవీఈఓ వెంకటరమణానాయక్, డీటీసీ రసూల్, బీసీ వెల్ఫేర్ అధికారి ఖుష్బూ కొఠారి తదితరులు పాల్గొన్నారు.

యాంటీబయాటిక్స్‌తో అనర్థాలు

అధికంగా వాడితే ప్రమాదమే

అవగాహన సదస్సులో వైద్యాధికారులు



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి

అనంతపురంటౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): వ్యాధులు త్వరగా నయం కావాలని ఇష్టానుసారం యాంటీబయాటిక్ మందులు వాడితే అనర్థాలు అధికంగా ఉంటాయని వైద్యాధికారులు ప్రజలకు సూచించారు. జాతీయ నవజాత శిశుసంరక్షణ వారోత్సవాల సందర్భంగా జిల్లా ఆస్పత్రిలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీదేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవికుమార్, డీఐఓడాక్టర్ యుగంధర్, వైద్యకళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవీన్‌కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ నవజాతశిశువులు వ్యాధుల బారిన పడినపుడు ఆస్పత్రిలోని డాక్టర్లకు చూపించి, వారు ఇచ్చిన మందులను మాత్రమే వాడాలన్నారు. గర్భిణులు, బాలింతలు కూడా అధిక డోసేజ్ ఉన్న యాంటిబయాటిక్స్ మందులు వాడకూడదని సూచించారు. ఈ యాంటీబయాటిక్ మందుల వల్ల కలిగే అనర్థాలపై ఈనెల 21వరకు జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంఓలు డాక్టర్ పద్మజ, డాక్టర్ హేమలత, చిన్నపిల్లల విభాగం అధికారి డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పత్తికి తెగుళ్లు

పైరును ఆశించిన గులాబి రంగు చీడ

ఇళ్లలో నిల్వ ఉంచిన పత్తికి ఎర్ర పురుగు



ట్రాక్టరుతో పత్తి పంట తొలగింపు..



గులాబీ రంగు పురుగు ఆశించిన పత్తి కాయలు

గుత్తి రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):పత్తికి గులాబీ రంగు చీడ ఎర్ర తెగుళ్లు పచ్చపురుగు ఆశించడంతో వందలాది ఎకరాలలో పంట నాశనమవుతోంది. వర్షం అధికం కావడంతో తెగుళ్లు సోకి పత్తి పంటను గుల్ల చేస్తున్నాయి. మండల వ్యాప్తంగా సుమారు 1000హెక్టార్లలో పత్తి పంటను సాగుచేశారు. పత్తి పంటను వర్షాలకు అనుగుణంగా మూడు దఫాలుగా సాగు చేశారు. ఎకరాకు 15 వేల నుంచి 20 వేల వరకూ పెట్టుబడి పెట్టారు. పంట సరిగా పండితే ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల వరకూ దిగుబడి వస్తుంది. తెగుళ్లు పంటను నాశనం చేస్తుండడంతో ప్రస్తుతం 3 నుంచి 5 క్వింటాళ్ల వరకూ మాత్రమే దిగుబడి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి కాయలలోకి గులాబీ రంగు పురుగు ప్రవేశించి నాశనం చేస్తుంది పురుగు నివారణకు పలు రకాల మందులు పిచ్చికారి చేసిన ఫలితం లేకుండాపోతుంది. రెండు సార్లు సత్తవ మందును విత్తారు. వర్షాలకు పత్తి పంట ఎర్ర తెగుళ్లలకు కాయలని నలపు, ఎరుపు రంగులో మారి పత్తి కాయలు పగలకుండ బుజు పట్టి నేల రాలి పోతున్నాయి. ఆగస్టు మాసంలో వర్షాలు రాక పోవడంతో పత్తికి ఉన్న పూత పిందేలు రాలి పోయాయి. ప్రస్తుతం పత్తి పంటకు తెగుళ్లు ఆశించడంతో ఈ ఎడాది ఆశించిన విధంగా పత్తి పంట రాలేదని రైతులు అంటున్నారు. పత్తిని తొలగించిన పంటను ఇళ్లలో ఉంచారు. నిల్వ ఉంచిన పత్తి పంటకు ఎర్రపురుగు ఆశించింది. వాటిని అమ్ముకొవాలంటే పత్తి తుకం తగ్గుతుందన్నారు.



తెగుళ్లు, చీడలతో నష్టపోయా

నేను 8 ఎకరాలలో పత్తి పంటను సాగు చేశాను పత్తి పంటకు 5సార్లు మందు పిచికారీ చేశా. రెండుసార్లు సత్తవ మందు వేశాను ఇప్పటి వరకు లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టాను గులాబీ రంగు పురుగు, ఎర్ర ఎర్ర తెగుళ్లు సోకడంతో పంట దిగ్గుబడి తగ్గి పోయింది. వాటికి ఉన్న పత్తికాయలు నేల రాలుతున్నాయి. తెగుళ్లతో నష్ట పోతున్నాము.

- సూర్యనారాయణ, బేతాపల్లి

తెగుళ్లను నివారించవచ్చు

పత్తి పంటకు ఎర్ర తెగులు అశించి ఉంటే ఎకరానికి ఒక లీటరు నీటికి 5 మిల్లీ లీటర్ల వేపనూనె కలిపి పిచికారి చేయాలి. పురుగు ఉధృతి ఎక్కువ ఉంటే 300 గ్రాముల థయోడికార్బ్ లేగా 500 ఎం.ఎల్ క్లోరోపైరిపాస్ ఉదయం పూట పిచికారి చేయాలి. గులాబీ రంగు పురుగు ఆశించి ఉంటే ఎకరానికి 4 నుంచి 6 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలి. - వెంకటరాముడు, ఏడీఏ, గుత్తి

పత్తి దిగుబడి శూన్యం




నేను 5 ఎకరాలలో పత్తిపంట సాగు చేశాను. ఆగస్టు మాసంలో అరకొర వర్షం వచ్చింది. వర్షం వచ్చింటే పత్తి కొంత వరకు దిగుబడి వచ్చేది. వర్షం రాక పోవడంతో బెట్ట పోయి పత్తి చేట్టుకు ఉన్న పూత పిందేలు రాలిపోయాయి. ప్రస్తుతం వర్షలు ఎక్కువగా రావడంతో పత్తి కాయలు నల్లగా మారి పత్తి పగలకుండ బుజు పట్టి నల్లగా అయిపోలున్నాయి. ఈ ఎడాది పత్తి దిగుబడి శూన్యం. - రైతు రంగప్ప, బేతాపల్లి

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ఆదిరాజు వీరభద్రరావు (జయంతి)



తెలంగాణ ప్రాంత చరిత్ర, సంస్కృతిపై విశేష పరిశోధన చేసిన భాషా శాస్త్రవేత్త ఆదిరాజు వీరభద్రరావు 1890 నవంబరు 16న ఖమ్మం జిల్లా మధిర మండలం దెందుకూరులో జన్మించారు. 'తెలంగాణ శాసనాలు' గ్రంథ ప్రచురణలో ఆయన కృషి నిరుపమానమైనది. ఆంధ్ర పరిశోధక మండలికి కార్యదర్శిగా వ్యవహరించారు. శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంలో లైబ్రే రియన్‌గా, కార్యదర్శిగా, అధ్యక్షుడిగా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ విశిష్ట సభ్యునిగాను, వివిధ సంఘాలలోనూ క్రియాశీలకంగా వ్యవహరిం చారు. అలనాటి దక్కన్ రేడియోలో తెలుగులో తొలి ప్రసంగం చేసిన ఘనత ఆయనదే. 1973 సెప్టెంబరు 28న కన్నుమూశారు.

బీఎన్ రెడ్డి (జయంతి)



పద్మభూషణ్ పురస్కార గ్రహీ త, దక్షిణాదిన దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు అందు కున్న తొలివ్యక్తి బొమ్మిరెడ్డి నరసింహా రెడ్డి (బీఎన్ రెడ్డి) 1908 నవం బరు 16న కడప జిల్లా పులి వెందుల తాలూకా కొత్తపల్లి గ్రామంలో జన్మించారు. తెలుగు సినీ రంగంలో దర్శకుడు, నిర్మాత, కథ, స్క్రీన్‌ప్లే రైటర్‌గా తనదైన ప్రతిభను చాటు కున్నారు. 1951లో ఎన్టీఆర్, భానుమతిలు నటించిన 'మల్లీశ్వరి' సినిమా ఆల్‌టైమ్ రికార్డుగా నిలిచింది. ఆయన సిని మాలలో జాన పదం, సంగీతాలకు ఎక్కువ ప్రాధాన్యత ఉండేది. భక్తపోతన, యోగివేమన, స్వర్గసీమ, బంగారుపాప వంటి సినిమాలు రూపొందించారు. 4 జాతీయ అవార్డులు, ఇతర పురస్కారాలు పొందారు. 1977 నవంబరు 8న కన్నుమూశారు.

కాంతారావు (జయంతి)



వెండితెరపై కత్తి కాంతారావుగా పేరొందిన తాడేపల్లి లక్ష్మీ కాంతా రావు 1923 నవంబరు 16న అప్పటి ఉమ్మడి నల్గొండ జిల్లా (ప్రస్తుత సూర్యాపేట) కోదాడలో జన్మించారు. పౌరాణిక, సామా జిక, సాంఘికం ఇలా 400కుపైగా సినిమాలలో నటిం చారు. నారద, శ్రీకృష్ణ, అర్జున పాత్రలతో పేరొందారు. ప్రత్యేకించి కత్తి ఫైటింగులలో రాణించారు. కొన్ని సినిమాలకు నిర్మాతగా వ్యవహరించారు. లవకుశ సినిమాలో లక్ష్మణుడు పాత్రతో గుర్తింపు పొందారు. ఉత్తమ నటుడిగా 1963లో రాష్ట్రపతి అవార్డు, ఇంకా రఘుపతి వెంకయ్య అవార్డు, నంది అవార్డు, మహా నటి సావిత్రి అవార్డు, సీహెచ్ నారాయణరావు అవా ర్డు, ఇతర పురస్కారాలు అందుకున్నారు. 2009 మార్చి 22న కన్నుమూశారు.

పుల్లెల గోపీచంద్ (పుట్టినరోజు)



జాతీయస్థాయి బ్యాడ్మింటన్ క్రీడా కారుడు, 'పద్మభూషణ్' గ్రహీత పుల్లెల గోపీచంద్ 1973 నవం బరు 16న ప్రకాశం జిల్లా నాగం డ్లలో జన్మించారు. ప్రస్తుతం ఇండియన్ నేషనల్ బ్యాడ్మింటన్ టీమ్‌కు చీఫ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. 2001లో ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ విజేత. అంతేకాక సొంత బ్యాడ్మింటన్ అకాడమీ ఏర్పాటు చేసి సైనా నెహ్వాల్, పీవీ సింధు, సాయి ప్రణీత్, పారుపల్లి కశ్యప్, శ్రీకాంత్ కిడాంబి వంటి ప్రతిభా వంత క్రీడాకారులను దేశానికి అందించారు. పద్మశ్రీ, అర్జున అవార్డు, రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న అవార్డు, ద్రోణాచార్య వంటి కీలక పురస్కారాలు అందు కున్నారు. ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ చాంపి యన్‌షిప్‌లో 2001లో విజేతగా నిలిచారు. ప్రకాశ్ పడుకొనె తర్వాత రెండో భారతీయ క్రీడాకారుడిగా రికార్డు సాధించారు.

తైవాన్ సాంకేతిక బ్రాండ్ల ప్రదర్శనకు శ్రీకారం

బెంగళూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తైవాన్ దేశానికి చెందిన సాంకేతిక, సంస్కృతి ఆధునికతకు అద్దంపట్టేలాంటి వస్తువుల ప్రదర్శనను లులు మాల్‌లో ప్రదర్శించారు. శుక్రవారం వైబ్రంట్ ఇన్నోవేషన్స్, బ్రాండ్ అనుభవాలకు శ్రీకారం చుట్టారు. చెన్నైకు చెందిన తైవాన్ ఆర్థిక, సాంస్కృతిక విభాగం డైరెక్టర్ రిచర్డ్‌చెన్, తైవాన్ వరల్డ్‌ట్రేడ్ సెంటర్ లైజెన్ ఆఫీస్, చెన్నై డైరెక్టర్ జూల్స్ షిహా, బాలీవుడ్ నటి నేహాశర్మలు పాల్గొన్నారు. మూడు రోజులపాటు కొనసాగే ప్రదర్శనలో తైవాన్ ఉత్పత్తుల ప్రదర్శనతోపాటు అక్కడి సంస్కృతికి అద్దం పట్టేలాంటి ప్రదర్శనలు ఉంటాయన్నారు.

అస్తిత్వం లేని సంఘానికి ఎన్నికలు..?

దొడ్డబళ్ళాపుర, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అస్తిత్వం లేని సంఘం డైరెక్టర్‌ల స్థానాలకు ఎన్ని కలు నిర్వహించడం వివాదానికి కారణమైంది. దొడ్డతుమకూరు వివిధోద్దేశ్య ప్రాథమిక గ్రామీణ కృషి సహకారసంఘానికి అక్టోబరు 26న జరిగిన ఎన్నికలు చట్ట వ్యతిరేకమంటూ చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేస్తూ ఎన్నికల అధికారికి న్యాయవాది టీకే హనుమంతరాజు జిల్లా అధికారి ఫిర్యాదు చేశారు. దొడ్డతుమకూరు వ్యవసాయ సేవా సహకార సంఘం పేరిట ఎన్నికలు జరిగాయన్నారు. బెంగళూరు గ్రామీణ జిల్లా ఎన్నికల అధికారి, సహకార సంఘాల డిప్యూటీ డైరెక్టర్ అక్టోబరు 3న రిటర్నింగ్ అధికారిగా నియమితులయ్యారని వివరిం చారు. ఎన్నికలు నిర్వహించడం చట్ట వ్యతిరేకమని ఆరోపించారు.

ప్రైవేటు కార్యక్రమాలకు అనుమతి లేదు

కొత్తచెరువు, నవంబరు15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో రాజకీయ, మత, వివాహ తది తర కార్యక్రమాలకు ఇక నుంచి అనుమతి ఉండదని విద్యాశాఖ ఏడీ-3 లాజర్ శుక్రవారం ప్రకటనలో తెలి పారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు. గతంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశా లల్లో శుభకార్యాలు, రాజకీయ సమావేశాలకు అను మతులు ఇచ్చేవారు. ఇకపై అనుమతి ఇవ్వడాన్ని రద్దు చేస్తున్నట్లు ఏడీ తెలిపారు.

అగ్రికల్చర్ విద్యార్థులు ఉద్యోగులు కారాదు

» మంత్రి మునియప్ప

» కృషిమేళాలో రెండోరోజూ అదే సందడి



విజేతలను సన్మానిస్తున్న మంత్రి మునియప్ప తదితరులు

బెంగళూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అగ్రికల్చర్ కోర్సు చేసే విద్యార్థులు ఉద్యోగులు కారాదని ఉపాధి, ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని పౌర, ఆహార సరఫరాలశాఖ మంత్రి కేహెచ్ మునియప్ప పిలుపునిచ్చారు. కృషి మేళాలో రెండోరోజూ శుక్రవారం మైసూరు, చామరాజనగర్ జిల్లాల ఉత్తమ రైతులకు సన్మానం చేశారు. అత్యుత్తమ శాస్త్రీయ రచనలకు డాక్టర్ ఆర్ ద్వారకనాథ్, ప్రొఫెసర్ బీవీ వెంకటరావ్‌లకు పురస్కారాలు అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి మునియప్ప మాట్లాడుతూ వ్యవసాయ కోర్సులు చేసేవారు ఆధునిక సాంకేతికతతోపాటు యాంత్రీకరణపై పరిశోధనలు జరపాలన్నారు. నూతన వంగడాలు, రోగ నిరోధకశక్తిని పెంచే పంటలు సాగు చేసేందుకు అన్నదాతలు ప్రోత్సహించాలన్నారు. దేశజనాభా 150కోట్లదాకా చేరుతోందని ఈ తరుణంలో దిగుబడి పెంచుకోవాలనే ఆత్రుతలో రసాయనాలు, క్రిమిసంహారకాలు అత్యధికంగా ఉపయోగించి మనిషి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపేలా మారుతోందన్నారు. పోషకాంశాల కొరతతోపాటు వైద్య ఖర్చులు పెరుగుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. కాగా రెండోరోజు సందర్శకులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తరలివచ్చారు. ఏకంగా 7.6లక్షలమంది సందర్శించగా 1.25 కోట్ల రూపాయల వ్యాపార లావాదేవీలు జరిగాయన్నారు. వర్షంను లెక్క చేయకుండా విద్యార్థులు సైతం ఉత్సాహంగా పాల్గొన్నారు.



ప్రత్యేక ఫొటో పాయింట్‌లో విద్యార్థులు



రెండోరోజూ అదే రద్దీ

పారిశ్రామిక ప్రదర్శనలతో ప్రజల్లో చైతన్యం

బెంగళూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రదర్శనలు ప్రస్తుత తరుణంలో అత్యంత అవసరమని కేఎస్ఎస్ఐడీసీ ఎండీ కెప్టెన్ కె.రాజేంద్ర అభిప్రాయ పడ్డారు. కాసియా, ఎంఎస్ఎంఇ కార్యాలయం సంయుక్తంగా ఎగ్జిబిషన్ కమ్ సేల్ ప్రదర్శనలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేంద్ర మాట్లాడుతూ పారిశ్రామిక ప్రదర్శనల ద్వారా తమ పరిధిలో ఉండే పరిశ్రమలు ఏ విధమైన ఉత్పత్తులు సాధ్యమవుతాయని తెలుస్తాయన్నారు. ప్రత్యేకించి ఎంఎస్ఎంఇల ప్రగతికి ప్రదర్శనలు కీలకం కానున్నాయన్నారు. ఉత్పత్తులకు మార్కెటింగ్, మానవ వనరులు ముఖ్యమన్నారు. గోవిందరాజనగర ఎమ్మెల్యే ప్రియాకృష్ణ, ఎంఎస్ఎంఇ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సాక్రటీస్‌తోపాటు ఎస్‌బిఐ అసిస్టెంట్ ఎండీ సుహాసినితో పాటు పలువురు పాల్గొన్నారు. కాసియా సంఘం అధ్యక్షుడు ఎంజి రాజగోపాల్ మాట్లాడుతూ పరిశ్రమల ద్వారానే దేశ జీడీపీ ప్రగతి సాధ్యమన్నారు. ఉత్పాదన 40శాతం, ఎగుమతులు 48శాతానికి, ఎంఎస్ఎంఇతోపాటు భారీ పరిశ్రమల ప్రగతికి కారణమన్నారు.



ప్రదర్శనలో కెప్టెన్ రాజేంద్ర, ఎమ్మెల్యే ప్రియాకృష్ణ తదితరులు

ఆభరణాల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వండి

» మంత్రి దినేశ్‌గుండూరావు

బెంగళూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆభరణాల ఎంపికలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి దినేశ్ గుండూరావు అభిప్రాయపడ్డారు. శేషాద్రిపురంలో త్రిదియా జెమ్స్ షోరూంను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బంగారం, వెండి ధరలు ఆకాశాన్నంటేలా పెరిగాయన్నారు. కొనుగోలు దారులు నమ్మకమైన షోరూంలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఉదయ్ గరుడాచార్, రవిసుబ్రమణ్య, నటి అదితి ప్రభుదేవ్‌తోపాటు కంపెనీ ముఖ్యులు పాల్గొన్నారు.



షోరూం ప్రారంభంలో మంత్రి దినేశ్ గుండూరావు

సీఎం, డీసీఎం.. 'మహా' ప్రచారం



భీవండి నియోజకవర్గంలో డీసీఎం డీకే శివకుమార్ ప్రచారం

బెంగళూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర ఎన్నికల ప్రచారానికి సీఎం, డీసీఎంలు వెళ్లారు. సాంగ్లి జిల్లా జత్ శాసనసభ నియోజకవర్గం సంగ్ గ్రామం బహిరంగసభలో సీఎం సిద్దరామయ్య ప్రచారం చేశారు. మహావికాస అఘాడి అభ్యర్థి విక్రం సావంత్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. కాగా ప్రధాని నరేంద్రమోదీ కర్ణాటక ప్రభుత్వం పట్ల దుష్ప్రచారం చేశారని పట్టించుకోవద్దన్నారు. అభివృద్ధికి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. అహ్మద్ నగర్ జిల్లా జమఖేడ్ తాలూకా చోండిలోనూ శుక్రవారం పర్యటించారు. రాజమాత అహల్యాబాయి హోల్కర్‌కు గౌరవం సమర్పించారు. మంత్రి ఎంబీ పాటిల్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. మరోవైపు డీసీఎం డీకే శివకుమార్ ముంబైలోని భీవండి నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి దయానంద్ చోర్గే తరపున ప్రచారం చేశారు.

జలజీవన్ మిషన్ పనులకు శ్రీకారం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ గోపినాథరెడ్డి తదితరులు

దొమ్మసంద్ర, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): దొమ్మసంద్ర గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో జలజీవన్ మిషన్ పనులకు ఎమ్మెల్సీ గోపినాథరెడ్డి భూమిపూజ చేశారు. సుమారు 35వేల జనాభా ఉన్న గ్రామంలో నీటికొరత ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో తాలూకాలోని అన్ని గ్రామాలలో జలజీవన్ మిషన్ పనులు చాలావరకు పూర్తయ్యాయి. గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సభ్యుడు ఉమేశ్ మాట్లాడుతూ ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న దొమ్మసంద్ర గ్రామంలో రూ.9కోట్లతో జలజీవన్ మిషన్ పనులు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. గ్రామంలో సుమారు 200 రేషన్‌కార్డులు రద్దు చేశారని, పేద కుటుంబాలను పరిశీలించి మళ్లీ కార్డులను జారీ చేయాలని కోరారు. బీజేపీ ప్రముఖుడు శివప్ప మాట్లాడుతూ రాష్ట్రంతోపాటు తాలూకాలోని పలు గ్రామాల్లో జలజీవన్ మిషన్ పనులు ప్రారంభమ య్యాక పలు చోట్ల రోడ్లు దెబ్బ తిన్నాయని, ఆరు నెలలు గడిచినా బాగు చేయలేదని ఆక్రోశం వ్యక్తం చేశారు. వెంటనే గుంతలు పూడ్చాలన్నారు. ఇదే సందర్భంగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించగా బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు. 200మందికి పైగా శిబిరం ప్రయోజనాలను పొందారు. కార్యక్రమంలో యోజనా ప్రాజెక్టు మాజీ అధ్యక్షుడు జయణ్ణ, ఎమ్మెల్సీ గోపినాథరెడ్డి, దొమ్మసంద్ర గ్రామపంచాయతీ అధ్యక్షుడు నరేశ్, ఉపాధ్యక్షులు దివ్య, అభివృద్ధి అధికారి మంజునాథరెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'వీరలోక పుస్తకసంతె' కు తరలిన సాహిత్య అభిమానులు



బుక్‌ఫెస్టివల్ ప్రారంభంలో మాజీ ఎంపీ ఉగ్రప్ప తదితరులు

బెంగళూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సాహిత్య అభిరుచి, పుస్తకాభిమానం పెంపొందించేందుకై వీరలోక సంస్థ ఆధ్వర్యంలో జయనగర్ శాలిని గ్రౌండ్స్‌లో 'వీరలోక పుస్తకసంతె'కు సాహిత్య అభిమానులు తరలివచ్చారు. పుస్తకసంతెను కర్ణాటక రక్షణ వేదిక అధ్యక్షుడు నారాయణగౌడ, మాజీ ఎంపీ ఉగ్రప్ప, ఎమ్మెల్యే సీకే రామమూర్తిలు ప్రారంభించారు. వీరకపుత్ర శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన సంతెలో ఆరు పుస్తకాలను లాంచనంగా విడుదల చేశారు. 75 స్టాళ్లలో పుస్తకాల ప్రదర్శనలు కొనసాగాయి. గతంలో ఎన్నడూలేని విధంగా 20మంది రచయితలు తమ పుస్తకాలను నేరుగా విక్రయించే అవకాశం కల్పించారు. 10వేలమందికిపైగా సందర్శకులు తరలివచ్చారు. బుక్‌ఫెస్టివల్ మరో రెండు రోజులు ప్రదర్శనలు ఉంటాయని వీరకపుత్ర శ్రీనివాస్ తెలిపారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి



ఉపతహసీల్దారు ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేత

బంగారుపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వానికి చెందిన బెమెల్ కేజీఎఫ్ ఫ్యాక్టరీలో కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్రం స్పందించడం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ ఆక్రోశం వ్యక్తం చేశారు. శుక్రవారం తాలూకా కార్యాలయంలో ఉపతహసీల్దారు ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. బెమెల్‌లో పర్మినెంట్ ఉద్యోగుల సంఖ్య తగ్గిందని, ఉత్పాదనా విభాగంలో కంట్రాక్టు ఉద్యోగులే ఉన్నారని తద్వారా లావాదేవీలు, లాభాలు పెరిగాయని అయితే కంట్రాక్టు ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించడం లేదన్నారు. సుమారు 30ఏళ్లపాటు విధులు నిర్వహించి రిటైరైనవారికి కనీస సదుపాయాలు దక్కడం లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమానవేతనం కల్పించాలని డిమాండ్ చేశారు. పలుమార్లు విన్నవించినా ప్రయోజనం దక్కలేదన్నారు. తాలూకా సంచాలకుడు బీఎల్ కేశవరావ్ మాట్లాడుతూ నైపుణ్యత, సీనియారిటీకి అనుగుణంగా కార్మికులకు అవకాశం కల్పించాలని హైకోర్టు ఆదేశించినా అమలు కావడం లేదన్నారు. తాలూకా ప్రముఖుడు అప్పయ్యణ్ణ మాట్లాడుతూ కెజిఎఫ్ ఎమ్మెల్యే రూపకళ శశధర్, బంగారపేట ఎమ్మెల్యే నారాయణస్వామిలు ఆగస్టులో నిరసనవేళ సందర్శించి సమస్యలను జిల్లా అధికారి దృష్టికి తెచ్చి పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షుడు ఎం మోహన్, సీఐటీయూ రైతు నాయకుడు సీఆర్ మూర్తి, డీకేహళ్ళి గ్రామపంచాయతీ సభ్యుడు గణేశన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవం



దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

బెంగళూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): భక్తుల శివనామ స్మరణతో మంజునాథస్వామి ఆలయం మారుమోగింది. అరికెరె శాంతినికేతన్ లే అవుట్‌లో వెలసిన శాంతిధామలోని మంజునాథస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని లక్ష దీపోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరిగింది. వేలాదిమంది భక్తులు తరలివచ్చి దీపాలు వెలిగించారు. ప్రతిఏటా కార్తీక పౌర్ణమి రోజున లక్షదీపోత్సవాన్ని నిర్వహిస్తున్నామని ఆలయ ట్రస్టు అధ్యక్షుడు మేడా రామకృష్ణ వెల్లడించారు. ఏటా భక్తుల సంఖ్య పెరుగుతోం దన్నారు. స్వామివారికి పంచామృతాభిషేకం, గణపతి హోమం, అనంతరం అలంకరణ నిర్వహించామన్నారు. దీపోత్సవంలో పాల్గొనేందుకు భక్తులందరికీ అవకాశం కల్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రతి సోమవారం కూడా భక్త రద్దీ ఉందన్నారు. ఆకాశదీపాన్ని మేడా కుటుంబీకులు ప్రజ్వలింప చేశారు. ట్రస్టు ఉపాధ్యక్షుడు ముకేశ్‌కుమార్ వర్మ, కార్యదర్శి తాతయ్యగుప్త, కృష్ణయ్యశెట్టి, వెంకటేశ్ గుప్త, సత్యనారాయణశెట్టి, ట్రస్టు సభ్యులు, సేవాదళ్ కార్యకర్తలు పాల్గొన్నారు. ఇతర శివాలయాలలోనూ విశేషపూజలు కొనసాగాయి.

ఆలయానికి రూ.1.5లక్షల విరాళం



డీడీ అందజేస్తున్న ధర్మస్థళ గ్రామభివృద్ధి సంస్థ సభ్యులు

శిడ్లఘట్ట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని సాదలి గ్రామంలో వీరగారస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు ధర్మస్థళ సంస్థ రూ.1.50లక్షలు విరాళంగా అందచేసింది. ఆలయ అభివృద్ధి సమితికి ధర్మస్థళ గ్రామాభివృద్ధి పథకం జిల్లా డైరెక్టర్ ప్రశాంత్ డిడి అంద చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ ధర్మస్థళ ధర్మాధికారి డాక్టర్ వీరేంద్రహెగ్డే సహకారంతో ధర్మస్థళ గ్రామాభివృద్ధి సంస్థ ఆర్‌బిఐ నియమాలకు అనుగుణంగా జాతీయ బ్యాంకులలో బిసి ప్రతినిధులైన స్వసహాయసంఘాల సభ్యులకు బ్యాంకు ద్వారా తక్కువవడ్డీతో రుణాలు ఇస్తున్నట్టు తెలిపారు. పాలడెయిరీ భవనాలకు, పాఠశాల భవనాలకు గ్రాంట్లు, విద్యార్థులకు సుజ్ఞాన నిధి పేరిట స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నామన్నారు. ఆలయ అభివృద్ధి సమితి అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామలలో ఆలయాల జీర్ణోద్ధరణకు, సముదాయ భవనాల నిర్మాణానికి, పాల డెయిరీల ఏర్పాటుకు ధర్మస్థళ సంస్థ సహకారం అందిస్తున్నారని కొనియాడారు. సాదలి పాల ఉత్పత్తిదారుల సహకారసంఘం అధ్యక్షురాలు నిర్మలా మంజునాథ, సభ్యుడు విజయానంద, సురేశ్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో గురునానక్ జయంతి

బెంగళూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో గురుద్వారాలలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. గురునానక్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం హలసూరు సమీపంలోని గురుద్వారాలో విశేష ప్రార్థనలు కొనసాగాయి. సిక్కు గురువులు ధార్మిక ప్రసంగంలో గురుగ్రంథ్‌సాహిబ్‌లోని అంశాలను బోధించారు. నగరంలోని వివిధ ప్రాంతాలలో నివసించే సిక్కులంతా గురుద్వారాలకు చేరుకున్నారు. ఉదయం నుంచి రాత్రిదాకా గురుద్వారాలు సందడిగా సాగాయి. మైసూరు, మంగళూరు, బెళగావితోపాటు వివిధ ప్రాంతాల్లోని గురుద్వారాలలోనూ ప్రార్థనలు చేశారు. ప్రత్యేకంగా గురుద్వారాలు లేని చోట సిక్కులు తమ ఇళ్లల్లోనే ప్రార్థనలు కొనసాగించారు.



గురుద్వారాలో పాల్గొన్న భక్తులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.19	1,602.30
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,253	3,196
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	8,916	7,922
నీటి నిల్వ (టీఎంసీలు)	98.61	24.64

ఓటర్ల నమోదు పక్కాగా చేపట్టాలి

● అవకతవకలు జరిగితే అధికారులదే బాధ్యత ● రాజకీయ పార్టీలు సహకరించాలి: నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు ఎంఏ వెంకటేశ్

బళ్లారి సిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): భారత ఎన్నికల సంఘం సూచన మేరకు ఫొటోతో కూడిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ జరుగుతోందని, నమోదు, సవరణ పక్కాగా చేపట్టాలని జిల్లాఓటరు జాబితా పరిశీలకులు డాక్టర్ ఎం.వీ. వెంకటేశ్ అధికారులకు సూచించారు. శుక్రవారం నగరంలోని జిల్లా నూతన పాలనా భవనంలోని కిస్వాన్ వీడియో హాల్లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రగతి సమీక్షా సమావేశంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముసాయిదా ఓటరు జాబితా అక్టోబరు 29న ప్రచురించబడుతుందన్నారు. అభ్యంతరాలకు డిసెంబరు 28వరకు అవకాశం కల్పించారు. తుది జాబితా జనవరి 6, 2025 న వెలువడుతుందన్నారు. దీనికి సంబంధించి నవంబర్ 23,24 తేదీల్లో ప్రత్యేక ప్రచారం చేపడ్తామన్నారు. ఓటరు పేరు, చిరునామా, ఫొటో దిద్దుబాటు, ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు కొరకు నిర్ణీత ఫారమ్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమాచారాన్ని పక్కాగా పూరించాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ఓటర్లకు ఓటరు కార్డు తప్పనిసరిగా ఉండాలని, అధికారులు ఇంటింటికీ వెళ్ళి పరిశీలించాలన్నారు. అన్ని పార్టీలు పోలింగ్ బూత్ లెవల్ ఏజెంట్లను నియమించి జాబితా రూపొందించాలని వివిధ పార్టీల నేతలకు సూచించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ జుబేర్, అసిస్టెంట్ కమిషనర్ రాజేశ్, తాహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలనాధికారి వెంకటేశ్, పక్కన కలెక్టర్ మిశ్రా



ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ కాళింగ

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

బళ్లారిరూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కారు, లారీ ఢీ కొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గురువారం సాయంత్రం తాలుకాలోని మోకా పోలీస్‌స్టేషన్ పరిధిలో గల శివపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బెంగళూరు నెళమంగళకు చెందిన వాణి (40) మృతి చెందింది. వారి బంధువులు చంద్రకళ, మంజునాథ తీవ్రంగా గాయపడ్డారు. నెలమంగళ నుంచి మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శించుకుని బళ్లారి వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ వేగంగా వచ్చి ఢీ కొనింది. వాణి అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి మోకా పోలీసులు చేరకున్నారు. క్షతగాత్రులను బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించి దీనిపై కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదంలో కార్మికుడు మృత్యువాత

బళ్లారిరూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో గాయపడిన కార్మికుడు మృత్యువాత పడ్డారు. శుక్రవారం తాలుకాలోని పీడీ హళ్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గల ఏ వన్ ఫ్యాక్టరీ కర్మాగారం విధులు నిర్వహిస్తున్న బీహార్‌కు చెందిన హరీష్ కుమార్ (22) అనే యువకుడు మిషనరీల వద్ద పనులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పీడీ హళ్లి పోలీసులు తెలిపారు.

జెన్నీ మిల్క్ కార్యాలయం తనిఖీ



జెన్నీ మిల్క్ కార్యాలయం వద్ద సీఐడీ అధికారులు

బళ్లారి సిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గాడిద పాల వ్యాపారం పేరుతో రైతులను మోసం చేసిన జెన్నీ మిల్క్ కార్యాలయాన్ని శుక్రవారం సీఐడీ అధికారులు తనిఖీ చేశారు. విజయనగం జిల్లా హొసపేటలో రైతులకు గాడిదలు ఇచ్చి పాలను కొనుగోలు చేసే వ్యవహారంలో జెన్నీ మిల్క్ కంపెనీ కోట్లాది రుపాయల మోసం కేసుకు సంబంధించి సీఐడీ విచారణ ప్రారంభించింది. శుక్రవారం కలబుర్గి డివిజన్ డీవైఎస్పీ అస్లాం పాషా నేతృత్వంలో మొత్తం ఎనిమిది మంది సభ్యుల బృందం గురువారం రాత్రి నగరానికి చేరుకుంది. ఉదయం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్ళి బాధితుల నుంచి వివరాలపై ఆరా తీశారు. తాలూకాలోని గాలెమ్మనగుడి భాగంలో గాడిదలను ఉంచే స్థలం ఉండడంతో బృందం అక్కడకి వెళ్ళి తనిఖీలు నిర్వహించారు. కొందరు బాధితులను పిలిపించుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హొసపేట సిటీ స్టేషన్‌లో కొంత మంది రైతులను కలుసుకుని సమాచారం తెలుసుకున్నారు. విజయనగరం ఎస్పీ శ్రీహరిబాబుతో సమావేశమై కేసుకు సంబంధించిన సమాచారం తెలుసుకున్న బృందం హంపి రోడ్డులోని జెన్నీమిల్క్ కంపెనీ కార్యాలయానికి వెళ్ళి విచారణ జరిపింది. ఈబృందంలో డీవైఎస్పీ అస్లాం బాషతో పాటు ఓ ఏఎస్సై , ఆరుగురు పోలీసు కానిస్టేబుళ్లు ఉన్నారు. ఈ బృందం వారం రోజుల పాటు నగరంలో మకాం వేసి విచారణ చేపట్టనుంది. ఈకేసుకు సంబంధించి గత నెల మొత్తం ఐదుగురిని అరెస్టు చేశారు. ఈవ్యాపారంపై రైతు సంఘం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టగా.... వ్యాపార లైసెన్స్ పొందకుండానే సంస్థ కార్యాలయాన్ని నడుపుతున్నట్లు తేలింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది రైతులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి కంపెనీ చేతిలో మోసపోయామని ఫిర్యాదు చేశారు.

బాధితులకు ఎమ్మెల్యే నారా పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

బళ్లారి నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక గోషాసుపత్రిలో బాలింతల మృతిపై ప్రజాసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నాయి. వైద్యులు ప్రజా జీవితాలతో ఆడుకోవడం మంచిది కాదని, రోగుల పట్ల నిర్లక్ష్య వైఖరి సరికాదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి విమ్స్ ఆస్పత్రిలో పర్యటించి రోగలను పరామర్శించారు. గర్భిణులకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహించడం తగదని, జాగ్రత్తగా వ్యవహరించాలని వైద్యులకు సూచించారు. మూడు రోజుల్లో ముగ్గురు బాలింతల మృతిపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాలింతలను పరామర్శించి చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓపీలో రోగులకు అందుతున్న వైద్యాన్ని పరిశీలించారు. విమ్స్ డైరెక్టర్ గంగాధర్‌గౌడ ఇతర సిబ్బందితో ఆయన చర్చించారు. ప్రసూతి, స్త్రీ ఆరోగ్య కేంద్ర విజయలక్ష్మీలతో బాలిలంతల మృతిపై ఆరా తీశారు. విమ్స్ ఆసుపత్రిలో సరైన వైద్యం అందటంలేదని డెంగీ, ఇతర వ్యాధుల ద్వారా మరణిస్తున్నారని కొందరు ఫిర్యాదు చేశారు.

చెరుకు పంటకు గిట్టుబాటు ధర నిర్ణయం

కంప్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): చెరకు పంటకు అధికారులు గిట్టుబాటు ధర కల్పించారు. కంప్లి, విజయనగర జిల్లా అధికారి ఎంఎస్ దివాకర్ చెరుకు పంట టన్నుకు రూ. 3151లు ధరను నిర్ణయించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. రైతులను దృష్టిలో వుంచుకుని హావిన అడగళి వద్ద వున్న బిరబ్బియ షుగర్ ఫ్యాక్టరీ, దుగ్గావతి వద్ద వున్న శ్యామరాజ షుగర్ ఫ్యాక్టరీలతో చర్చించి రైతులకు ధరలు నిర్ణయించినట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ఏపుగా పెరిగిన చెరుకు పంట



రహదారిని కమ్మేసిన మంచు

ముంచెత్తుతున్న మంచు

కంప్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తాలుకా పరిధిలోని పలు ప్రాంతాల్లో తెల్లవారు జామున మంచు కమ్మేస్తుండంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మంచు కురుస్తోందని కాయగూరల రైతులు ఆందోళన చెందారు. మంచు కారణంగా టమోటా, బీర, బెండ, ఇతర పంటలపై ప్రభావం పడుతోందని రైతులు వాపోతున్నారు. మంచు కారణంగా పంటలలో తెగుళ్ల అధికంగా సోకుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంప్లి పట్టణంలో వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణం కొనసాగిస్తున్నారు. మంచుమబ్బు వల్ల రైతులు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

జోరుగా చక్కెర హారతుల అమ్మకాలు



హారతులను కొంటున్న భక్తులు

బళ్లారి సిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలకు గౌరీ పండుగ అంటేనే సంబరాలతో నిండిపోతారు. కార్తీక పౌర్ణమినాడు చిన్న గౌరీ పండుగను, గౌరీ పౌర్ణమినాడు పెద్ద గౌరీ పండుగలను జరుపుకోవడం రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఆనవాయితీ. అమ్మాయిలు రంగు రంగుల పంచదార హారతులు పళ్ళెంలో ఉంచి గౌరీకి నైవేద్యం సమర్పిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆడపిల్లలు గౌరీ పిల్లలుగా వ్యవహరించి గ్రామంలోని ఇంటింటికీ రోడ్డుపై రంగు కర్రలతో గ్రామానికి వచ్చే వెళ్ళే వాహనాలను ఆపి డబ్బులు వసూలు చేస్తారు. వీటి కోసం చక్కెర హారతులను జోరుగా కొనుగోళ్లు చేస్తారు. ఈ సందర్భంగా హారతుల తయారీ దారడు శిశంకర స్వామి మాట్లాడుతూ రకరకాల ఆచ్చులతో , రంగరంగుల బొమ్మలు తయారు చేస్తామన్నారు.

కనుల పండువగా కార్తీక పౌర్ణమి



భక్తుల మధ్య సాగుతున్న బసవేశ్వర, నీలమ్మ రథాలు

వైభవంగా జోడు రథోత్సవాలు

కంప్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా తాలుకా పరిధిలోని రామసాగర గ్రామంలో ఆరాధ్యదైవమైన బసవేశ్వరస్వామి, నీలమ్మ జోడు రథోత్సవం శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామివారి అడ్డపల్లకి చేపట్టారు. సాయంత్రం రథోత్సవాన్ని ఆలయం ముందు నుంచి ఎదురు బసవన్న కట్టవరకు రథాన్ని లాగారు. సమీప గ్రామాల నుంచి భారీఎత్తున భక్తులు పాల్గొని పూలు, పండ్లతో మొక్కులు సమర్పించుకున్నారు.



ముక్తినాథేశ్వరాలయంలో



షుగర్ ఫ్యాక్టరీలో



బసవేశ్వరనగర్‌లో



ప్రత్యేకాలంకరణలో ముక్తినాథేశ్వరస్వామి

కంప్లి/బళ్లారి రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం భక్తులు దీపాలు వెలిగించి శివనామస్మరణతో భక్తిని చాటుకున్నారు. బళ్లారి నగరంలో బసవేశ్వర నగర్‌లో వెలిసిన సోమేశ్వరాలయంతో పాటు నగరంలో పలు ఆలయాల్లో మహిళలు పెద్దఎత్తున కార్తీక మాసం సందర్భంగా దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు దీపాలు వెలిగిస్తూ ఈశ్వరుడికి పూలు, పండ్లు సమర్పించారు. కంప్లి, హంపి, ముక్తినాథేశ్వరాలయం, షుగర్ ఫ్యాక్టరీ, కురుగోడు, కుడితిని తదితర ప్రాంతాల్లో కార్తీక దీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు.



పూజలందుకుంటున్న అమ్మవారు

గౌరీదేవికి పూజలు

సిరుగుప్ప, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా గౌరీ పూజలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సిరుగుప్ప పట్టణంలోని నాగలింగేశ్వరాలయంలో గౌరీదేవిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి మహామంగళహారతి ఇచ్చారు. అనంతరం భక్తాదులకు ప్రసాద పంపిణీ చేపట్టారు. శనివారం గౌరీ పండుగ జరుపుకోనున్నారు.

హోసూరు జోన్

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం



రోడ్డు పనులకు భూమిపూజలో ఎమ్మెల్యే ప్రకాశ్ తదితరులు

హోసూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): హోసూరు అసెంబ్లీ నియోజకవర్గం హోసూరు పంచాయతీ యూనియన్ బాగలూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నుంచి ప్రధాన రహదారి వరకు ఆధునిక రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే వై ప్రకాశ్ భూమిపూజ చేశారు. శుక్రవారం లాంఛనంగా పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం ప్రకాశ్ మాట్లాడతూ మాట్లాడుతూ డిమాండ్ మేరకు రూ.9.90లక్షలను ఎమ్మెల్యే ప్రాదేశిక అభివృద్ధి గ్రాంటుకింద మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ డీఎంకే కార్యదర్శి గజేంద్రమూర్తి, యూనియన్ డీఎంకే అధ్యక్షుడు నాగరాజ్, యూనియన్ ఉప కార్యదర్శి బాబు, రమేశ్, జిల్లా టీమ్ ఆర్గనైజర్లు ఆనందప్ప, శివశంకర్, జయరామన్, సునేశ్‌బాబు, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పోషకాహార కిట్ల పంపిణీ



పోషకాహర కిట్‌లను అందజేస్తున్న కలెక్టర్ సరయు, ఎమ్మెల్యే మదియళగన్

హోసూరు(కృష్ణగిరి), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ శుక్రవారం అరియలూరు జిల్లా తిరుమానూరు యూనియన్‌లోని వారణాసి చిల్డ్రన్స్ సెంటర్‌ల్లో పోషకాహారాన్ని రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ నేపథ్యంలో బర్గూరు సర్కిల్ ఒప్పావడి చిన్నారుల కేంద్రంలో రెండో విడత పోషకాహారం భరోసా ప్రాజెక్టును బర్గూరు ఎమ్మెల్యే మదియళగన్ సమక్షంలో జిల్లా కలెక్టర్ కె.ఎం.సరయు ప్రారంభించారు. సంవత్సరంలోపు ఆరోగ్యవంతమైన చిన్నారుల పెంపకంలో పాటించాల్సిన జాగ్రత్తలు, తీవ్రమైన మధ్యస్థ పోషకాహార లోపం ఉన్న పిల్లలకు ప్రత్యేక వైద్య పరీక్షలు అవసరమని కలెక్టర్ సూచించారు. ప్రత్యేక వైద్యం అవసరమైన పిల్లల మధ్య తేడాను గుర్తించే లక్ష్యంతో తమిళనాడు ముఖ్యమంత్రి నీలగిరి జిల్లాలో 2022 మేలో పోషకాహార నివారణకోసం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పోషకాహార లోపం ఉన్న పిల్లలు, బరువు, ఎత్తు, వారి వయస్సుకు సరిపోని 6 ఏళ్లలోపు పిల్లల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బాలింతలు, చిన్నారులకు పోషకాహారాన్ని ప్రభుత్వ అందిస్తోంది. పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలు 77.3 శాతం మంది కోలుకున్నారు. సమీకృత శిశు అభివృద్ధి కార్యక్రమ అధికారి జయంతి, జిల్లా పంచాయతీ కమిటీ అధ్యక్షురాలు మణిమేగల నాగరాజు, కలైయరసి కృష్ణమూర్తి, కదిరవన్, వైద్యాధికారి శివకుమార్, జిల్లా కలెక్టర్ పొన్నాల పంచాయతీ కౌన్సిల్ అధ్యక్షుడు జయవేల్, శిశు అభివృద్ధి కార్యక్రమ అధికారిణి వి .జ్యోతిలక్ష్మి పాల్గొన్నారు.

30 ఇయర్స్ ఇండస్ట్రీ..!

ఆరో తరగతి డాక్టర్‌ను అరెస్టు చేసిన పోలీసులు

హోసూరు(క్రైం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): హోసూరు రాంనగర్‌లో నకిలీ డాక్టర్‌ను మహబూబ్ అలి (56)ని అరెస్టు చేశారు. ఇతను ఆరో తరగతి వరకు చదివి సుమారు 30ఏళ్లుగా క్లినిక్ కొనసాగిస్తున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. సరిహద్దులోని మాలూరులో ఉంటూ రాంనగర్‌లో క్లినిక్ నిర్వహిస్తున్నాడు. హోసూరు కమోడిటీ డ్రగ్ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్ రాజీవ్‌గాంధీ, హోసూరు ప్రభుత్వ జిల్లా ప్రధాన ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ (ఇన్‌చార్జ్) జ్ఞానమీనాక్షిల నేతృత్వంలో తనిఖీలు నిర్వహించారు. డ్రగ్ కంట్రోలర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని క్లినిక్‌కు సీల్ వేశారు. ఇక్కడి సూదులు, మందులు స్వాధీనం చేసుకున్నారు. సరిహద్దులోని మాలూరులోనూ తనిఖీలు చేసి పలు ఔషధాలు స్వాధీనం చేసుకున్నారు. మరింత దర్యాప్తు సాగుతోంది.



దాడుల్లో పాల్గొన్న వైద్యాధికారులు, పోలీసులు

బాలింతల మృతిపై విచారణ చేపట్టాలి

● కలెక్టర్‌కు ఏఐఎంఎస్ఎస్ వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎంఎస్ఎస్ సభ్యులు

బళ్లారి సిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాసుపత్రిలో ముగ్గురు బాలింతల మృతిపై విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐఎంఎస్ఎస్(అఖిల భారత్ మహిళా సాంస్కృతిక సంఘం) జిల్లాకలెక్టర్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాధ్యక్షురాలు ఈశ్వరి మాట్లాడుతూ ప్రసవం కోసం జిల్లా ఆసుపత్రిలో చేరిన బాలింతలు పలు కారణాలతో మృతి చెందడం బాధాకరమన్నారు. మరో ఐదుగురు క్లిష్ట పరిస్థితుల్లో ఉండంగా ఇద్దరి పరిస్థితి విషమయంగా ఉన్నట్లు తెలిసిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన వైద్యసేవలు, వైద్య సిబ్బంది లేకపోవడంతో రోగులు మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు నష్టపరిహారం అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి, సంస్థ ఆఫీస్ బేరర్లు విద్య, రేఖ, గిరిజ,అభిలాష్ పాల్గొన్నారు.

ఫీజుల పెంపుతోనే అడ్మిషన్లు తగ్గాయి

● ఏఐడీఎస్ఓ జిల్లా కార్యదర్శి మంజునాథ్



బళ్లారి సిటీ,నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో ఫీజుల పెంపు కారణంగా అడ్మిషన్లు తగ్గిపోయాయని, తద్వారా పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఏఐడీ ఎస్ఓ జిల్లా కార్యదర్శి కంబలి మంజునాథ్ వాపోయారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అధిక మంది కూలీలు, వ్యవసాయ కూలీలు,పేద ప్రతిభావంత పిల్లలే చదువుతున్నారన్నారు. ప్రస్తుత ఆర్థిక సంక్షోభంలో చాలా మంది విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ప్రభుత్వ కాలేజీల్లో చదివేందుకు 3.5సెమిస్టర్ల అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోందని, ఈనెల 11తో అడ్మిషన్ల ప్రక్రియ ముగిసింది. మళ్ళీ గురువారం అడ్మిషన్ల ప్రక్రియ వ్యవధిని పొడిగించి జరిమానాతో రూ.5000 కట్టాలని సర్క్యులేషన్ జారీ చేశారన్నారు. ఇంతటి భారీ జరిమానాను పేదలపై మోపడం తగదన్నారు.